ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -251 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం 15 జూలై 2025

# మద్యం నాణ్యతలో రాజీ పడొద్దు


## ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష

- డేటా లేక్, డేటా అనుసంధానంపై చర్చ
- నేరాలు జరగకుండా చూడాలని సూచన
- మద్యం నాణ్యతలో రాజీ పడొద్దు
- బ్రాండెడ్ మద్యాన్నే సరఫరా చేయాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి,జూలై 14 ఆంధ్ర ప్రగతి :** అనుమానాస్పదంగా ఉన్న బ్రాండ్ల విక్రయాలను నిలిపివేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో ఆబ్కారీశాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యత ఉన్న మద్యం విక్రయాలు మాత్రమే రాష్ట్రంలో జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాన్ డ్యూటీ- పెయిడ్ లిక్కర్, నాటు-సారా విక్రయాలు జరగకూడదని స్పష్టం చేశారు. నాణ్యతతో కూడిన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కొత్త విధానంతో మద్యం అక్రమాలకు చెక్ పెట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నకిలీ బ్రాండ్ల విక్రయాలు రాష్ట్రంలో జరిగాయని, దీంతో ప్రజల ఆరోగ్యం పాడైందని చంద్రబాబు అన్నారు. 2014-19 మధ్య అమలైన మద్యం పాలసీ, గత ప్రభుత్వ హయాంలో అమలైన మద్యం పాలసీ విధానంపై అధ్యయనం చేసి నివేదికను ప్రజల ముందు ఉంచాలని సీఎం అధికారులకు దిశానిర్దేశర చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న మద్యం పాలసీతో రెవెన్యూ పెరిగిందన్నారు. నూతన మద్యం పాలసీ అమలు తర్వాత గతంతో పోలిస్తే కనీసం రూ.10 నుంచి రూ. 100 వరకు ధరలు తగ్గినట్టు- అధికారులు సీఎంకు వివరించారు. మద్యం ద్వారా దోపిడీ ఉండకూడదనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రతి నెలా కొనుగోలుదారులపై రూ.116 కోట్ల రూపాయల మేర భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. మిగతాది 2లో...

# జలవివాదంపై కేంద్రం చొరవ



- ఇరు రాష్ట్రాల సిఎంలతో 16న పాటిల్ భేటీ
- చంద్రబాబు,రేవంత్ రెడ్డిలకు ఆహ్వానం
- నేడు ఢిల్లీ వెళ్లనున్న ఎపి సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ/అమరావతి,జూలై 14 ఆంధ్ర ప్రగతి :** ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు. మిగతాది 2లో...

# సాక్ష్యంగా ఫోన్ రికార్డింగులు

- భార్య ఫోన్ సీక్రెట్ రికార్డింగ్.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- భార్య నుండి విడాకులు కోరిన బఠిండాకు చెందిన వ్యక్తి
- రికార్డింగులు సాక్ష్యంగా పరిగణించవచ్చని తెలిపిన సుప్రీం
- నిఘా పెట్టే పరిస్థితి వచ్చిందంటే వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందోనన్న సుప్రీంకోర్టు

2లో



# రేషన్ కార్డు పేదవాడి ఆకలి తీర్చే ఆయుధం

## నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి

- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే
- కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ
- కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి
- బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులకే ప్రాధాన్యం
- రైతులకు రుణమాఫీ...బోనస్ ఇచ్చిన ఘనత మాది
- కెసిఆర్ కట్టిన కాళేశ్వరం..కూలేశ్వరంగా మారింది
- ఇందుకు వారిని అక్కడే ఉరితీసినా నష్టం లేదు
- నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ

బిఆర్ఎస్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన సిఎం రేవంత్



**నల్గొండ,జూలై 14 ఆంధ్ర ప్రగతి ::** బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయలేదని మండిపడ్డారు. మిగతాది 2లో...

# తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్




దేశంలో పలువురు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల బదిలీలు

ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ బట్టు దేవానంద్

2లో

# భారత్ నెట్ కార్యక్రమంతో ఫైబర్ నెట్ అనుసంధానం




- ఫైబర్ నెట్‌లో వైసీపీ కార్యకర్తల్ని నియమించి దోచుకున్నారు: సీఎం చంద్రబాబు
- ఏపీ ఫైబర్ నెట్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
- సంస్థను మళ్లీ గాడినపెడదాం అంటూ అధికారులకు దిశానిర్దేశం
- కొత్త విధానాలు అమలు చేసి కనెక్షన్లు పెంచుకోవాలని సూచన

**అమరావతి,జూలై 14 ఆంధ్ర ప్రగతి :** గతంలో 2014-19 మధ్య ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని... దీన్ని తిరిగి గాడిలో పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో అన్నారు. సంస్థ ముందున్న సవాళ్లు, ఆర్థిక సమస్యలు, ఫైబర్ నెట్‌ను పూర్తి స్థాయిలో గాడిన పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కొత్త పాలసీ నిర్ణయాలపై సోమవారం నాడు సచివాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మిగతాది 2లో...

# ర్యాంకర్లను సన్మానించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

## జాతీయ స్థాయిలో తెలుగు విద్యార్థుల సత్తా

ఉండవల్లి నివాసంలో విద్యార్థులను కలిసిన మంత్రి నారా లోకేశ్

రాష్ట్రానికి గర్వకారణంలా నిలిచారని అభినందనలు



**అమరావతి,జూలై 14 (రిపబ్లిక్ న్యూస్)** నీట్ యూజీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రాజమండ్రికి చెందిన డి.కార్తీక్ రామ్ నీట్ యూజీ పరీక్షలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 19వ ర్యాంక్, ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 113వ ర్యాంక్, రాజమండ్రికి చెందినమిగతాది 2లో...

# గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

## కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి

హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా





2లో

# మద్యం నాణ్యతలో రాజీ పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పోలిస్తే ఏపీలో విక్రయిస్తున్న 30 ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. పర్మిట్ రూమ్‌లను అనుమతించే అంశంపై కమిటీ– అధ్యయనం చేసిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆబ్కారీ శాఖలో ఆర్టిఫిషియల్ ఇం–టె–లిజెన్స్(ఏఐ) లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసి ట్రేస్ అండ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. డిస్టిలరీల నుంచి బేవరేజెస్ కార్పొరేషన్, దుకాణాల వరకు వాహనాల కదలికలపై రియల్ –టైమ్‌లో ట్రాకింగ్ మెకానిజం ఏర్పాటు– చేసుకోవాలన్నారు. జీపీఎస్ పరికరాల ద్వారా మానిటర్ చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ నగదు లావాదేవీలను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.నేరాలు జరిగాక కట్టడి చేయడమే కాదు.. జరగకుండా చూసుకోవాలి.. ప్రమాదాలు జరిగాక స్పందించడం కాదు.. ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ పనితీరుపై సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్, డేటా లేక్, డేటా అనుసంధానం వంటి అంశాలపై చర్చించారు. అనుమానితులను గుర్తించే ఫేషియల్ రికగ్నేషన్ వ్యవస్థ పని తీరు మీద అధికారులు డెమో ఇచ్చారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "నేరగాళ్ల భరతం పట్టేందుకు టెక్నాలజీని వినియోగించుకోవడం మంచిదే. అయితే నేరం జరిగిన తర్వాత వారిని ట్రేస్ చేసి.. ఆ తర్వాత వారికి శిక్షలు పడేలా చేయడంతో పాటు.. అసలు నేరాలు జరగకుండానే చూడాలి. ముందుగానే అనుమానితులను గుర్తించాలి. వారి కదలికలను ట్రేస్ చేయాలి. వారు ఏ తరహా నేరాలకు పాల్పడ్డారనే అంశాన్ని కూడా డేటా బేస్ లో పెట్టుకోవాలి. వారి కదలికలను గుర్తించి అలెర్ట్ అయితే చాలా వరకు నేరాలను కట్టడి చేయవచ్చు. రౌడీ షీటర్లు, క్రిమినల్స్ కు వారి వారి నేరాలను బట్టి డేటాలో కలర్ కోడింగ్ ఇవ్వాలి. అలాగే కొన్ని ప్రమాదాలను ముందుగా గుర్తించగలిగితే.. వాటిని ముందుగానే నివారించవచ్చు. ఈ మేరకు ఆర్టీజీఎస్ పని తీరు మెరుగుపడాలి" అని చంద్రబాబు చెప్పారు.

హెచ్చరికలు ఫస్ట్... పెనాల్టీలు నెక్స్ట్

"రాష్ట్రంలోని అన్ని సీసీ కెమెరాలను అనుసంధానం చేయాలి. ట్రాఫిక్ మేనేజ్మెంట్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ రద్దీ వంటిది జరగ్గకుండా చూసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి వెంటనే చలానాలు విధించకుండా.. సిగ్నల్ జంప్ చేస్తున్న వాహనాల ఫొటోలను ముందుగా వారికి పంపాలి. అలా రెండు మూడుసార్లు చూసి.. వారిలో మార్పు రాకుంటే అప్పుడు చలానాలు విధించాలి. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెద్ద పెద్ద చదువులు చదివిన వారు కూడా సైబర్ నేరాలకు బలి అవుతున్నారు. దర్యాప్తు సంస్థల అధికారులం అంటూ ఫేక్ కాల్స్ వస్తే భయపడిపోతున్నారు. అప్పులు చేసి మరీ కోట్లాది రూపాయలు ఇచ్చేస్తున్నారు. అలాగే ఓటీపీల ద్వారా జరిగే సైబర్ మోసాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది." అని సీఎం వివరించారు.

ఆర్టీజీఎస్ డేటానే అన్నింటికీ మూలం

"వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే అందుబాటులో ఉన్న సేవలతో పాటు... మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని రకాల సర్టిఫికెట్లు ఆన్ లైన్ లో తీసుకోవడమే కాకుండా.. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాటిని డౌన్ లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించబోతున్నాం. టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నాం. అయితే ఇక్కడితో ఆగిపోకూడదు. టెక్నాలజీని ప్రజలకు చేరువ చేయడం ఎంత ముఖ్యమో.. వారికి అర్థమయ్యేలా చెప్పడం కూడా అంతే ముఖ్యం. వాటిని ఎలా ఉపయోగించాలో విడమరిచి చెప్పాలి. అవసరమైతే.. వాట్సాప్ గవర్నెన్స్ సేవలతో పాటు.. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వం అందించే ఇతర సేవలను ఎలా వినియోగించుకోవాలనే అంశాన్ని వివరిస్తూ చిన్న చిన్న వీడియోలు చేయాలి. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకుంటున్న వారికి ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయా..? ఎదురైతే.. వాటి వివరాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల పైనా.. నిరంతరం పని చేస్తూనే ఉండాలి. వాట్సాప్ గవర్నెన్స్ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా అన్ని శాఖలకు చెందిన రికార్డులను డిజిటలైజ్ చేయాలి. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా కాకుండా.. డిజిటలైజేషన్.. డేటా సేకరణ, డేటా అప్డేషన్ వంటి వాటి విషయాల్లో అన్ని శాఖలకు ఒకే రకమైన విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆర్టీజీఎస్ డేటానే అన్ని శాఖలకు ప్రామాణికంగా ఉండాలి. టెక్నాలజీ పరంగా జరుగుతున్న మార్పులను.. అమలు చేయాల్సిన అంశాలను ఆయా శాఖల్లో వివరించేందుకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించే విధంగా ఆలోచన చేయాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

డ్రోన్ సిటీ అభివృద్ధిపై దృష్టి

"ఓర్వకల్లులో డ్రోన్ సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. డ్రోన్ సిటీకి ప్రముఖ కంపెనీలు.. బహుళ జాతి సంస్థలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. డ్రోన్ సిటీలో ప్రభుత్వం ఇచ్చే వసతులను.. డ్రోన్ సిటీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించండి. డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా డిఫెన్స్ కంపెనీలను ఒప్పించగలిగితే.. ఎక్కువ పెట్టుబడులు వస్తాయి. అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది" అని సీఎం వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జలవివాదంపై కేంద్రం చొరవ

(మొదటి పేజీ తరువాయి)
చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదనలతో గోదావరి జలాలపై రచ్చ సాగుతోంది. ఈ క్రమంలో కేంద్రం ఈ భేటీ ఏర్పాటుచేయడం గమనార్హం. అయితే రేవంత్ ఢిల్లీ వెళతారా లేదా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఇకపోతే ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు. మంగళ, బుధవారాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ– కానున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభ, సీఐఐ బిజినెస్ మీట్‌లో చంద్రబాబు పాల్గొననున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించ నున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.30కు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. బుధవారం కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. నార్త్ బ్లాక్‌లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ– కానున్నారు. ఎల్లుండి సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 8 మంది మంత్రులు, అధికారుల బృందం ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళ్లనుంది. ఈనెల 30వ తేదీ వరకు ఈ బృందం సింగపూర్ లో పర్యటించనుంది. మంత్రులు లోకేశ్,నారాయణ,టీ–బీ భరత్, ఐఏఎస్ అధికారులు కాటంనేని భాస్కర్, ఎన్. యువరాజ్,కార్తికేయ మిశ్రా,కె. కన్నబాబు,సాయికాంత్ వర్మ ఈ బృందంలో ఉంటారు. పర్యటన ప్రధాన అజెండా రాజధాని నిర్మాణానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేయడమేనని సమాచారం. సింగపూర్ నగర ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యానవనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పన, భవిష్యత్తు సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి విషయాలను బృందం అధ్యయనం చేయనుంది.

# రేషన్ కార్డు పేదవాడి ఆకలి తీర్చే ఆయుధం

(మొదటి పేజీ తరువాయి)
సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు– వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వ లేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. రైతుకు బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 6, 500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. . నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగు తున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ తదతరులు పాల్గొన్నారు.

## విద్వేష పూరిత ప్రసంగాల కట్టడికి చర్యలు -కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జులై 14 ఆంధ్ర ప్రగతి :**
విద్వేషపూరిత ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని కూడా స్పష్టం చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా.. విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది.వాక్ స్వాతంత్య్ర విలువను పౌరులు తెలుసుకోవాలని, ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలీపై ఫిర్యాదు చేసిన వజహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. విద్వేష ప్రసంగాలు చేసే వారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావట్లేదని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలను షేర్ చేయకుండా కొన్ని కట్టడి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపింది.. ప్రజలు కూడా ఇలాంటి వాటిని షేర్ చేయకుండా సంయమనం పాటించాలని తెలిపింది. మేం ఇక్కడ సెన్సార్‌షిప్ గురించి మాట్లాడట్లేదు. కానీ, ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఈ విభజన ధోరణిని అడ్డుకోవాల్సిందేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసుల్లో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు. కానీ, భావ ప్రకటనా స్వేచ్ఛపై బాధ్యతాయుత ఆంక్షలు సరైనవే. వాక్ స్వాతంత్య్రం, భావ వ్యక్తీకరణ విలువలను ప్రజలు అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

**న్యూఢిల్లీ,జులై 14 ఆంధ్ర ప్రగతి :**
టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఇవాళ రెండు రాష్ట్రాలకు గవర్నర్ లను, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు, హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాలను కేంద్రం నియమించింది. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది.
విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకుడు మరియు పొలిట్ బ్యూరో సభ్యుడు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. రాజకీయంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన, విజయనగరం రాజవంశానికి చెందిన ప్రముఖ వ్యక్తి. ఆయన గోవా గవర్నర్‌గా నియమితులవడంపై టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇక, హర్యానా గవర్నర్‌గా ఇప్పటివరకు బండారు దత్తాత్రేయ సేవలందిస్తూ వచ్చారు. ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్‌ను కేంద్రం నియమించింది. విద్యారంగంలో ప్రముఖుడైన ఘోష్, ఈ కీలక పదవిని చేపట్టనున్నారు. అలాగే, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా నియమితులయ్యారు.
తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్‌లుగా పనిచేసిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో 20 మంది తెలుగు వారు గవర్నర్‌లుగా సేవలందించారు. వీరిలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రముఖులు కూడా ఉన్నారు.

# సాక్ష్యంగా ఫోన్ రికార్డింగులు

- భార్య ఫోన్ సీక్రెట్ రికార్డింగ్.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- రికార్డింగులు సాక్ష్యంగా పరిగణించవచ్చని తెలిపిన సుప్రీం

**న్యూఢిల్లీ,జులై 14 ఆంధ్ర ప్రగతి :**
భార్యాభర్తల మధ్య వివాహ బంధం ఎలా ఉందో భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్ లు స్పష్టం చేస్తాయని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పంజాబ్‌లోని బఠిండాకు చెందిన ఒక వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.ఇలాంటి కేసుల్లో భాగస్వామి ఫోన్ రికార్డింగ్ లను సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీంకోర్టు వెల్లడించింది. వారి మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికార్డింగ్ లు స్పష్టం చేస్తాయని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై అంతకుముందు పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది.బఠిండాకు చెందిన ఒక వ్యక్తి తన భార్య తన పట్ల క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ రికార్డింగులను సమర్పించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకుల కేసు విచారణను ప్రారంభించింది. దీనిని ఆమె పంజాబ్ హర్యానా హైకోర్టులో సవాల్ చేసింది.తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండానే రికార్డింగ్ చేశాడని, వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లే అవుతుందని భార్య హైకోర్టుకు తెలిపింది. విచారణ అనంతరం హైకోర్టులో ఆమెకు ఊరట దక్కింది. ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టింది. దీంతో ఆ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు.భార్యాభర్తల మధ్య సంభాషణకు సంబంధించిన రికార్డింగ్ లను సాక్ష్యాలుగా పరిగణిస్తే వైవాహిక బంధాలు ప్రమాదంలో పడతాయని కొందరు చెబుతున్నారని, కానీ భాగస్వాములు ఒకరిపై మరొకరు నిఘా పెట్టే పరిస్థితి వచ్చిందంటే వారి వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పరస్పరం విశ్వాసం లేదని అర్థమవుతోందని, అలాంటి వాటిని సాక్ష్యాలుగా పరిగణించవచ్చునని తెలిపింది. హైకోర్టు ఉత్తర్వులను కొట్టేసిన సుప్రీంకోర్టు, ఫ్యామిలీ కోర్టులో విచారణ కొనసాగించవచ్చునని తెలిపింది.

# తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్

**న్యూఢిల్లీ,జులై 14 ఆంధ్ర ప్రగతి :**
తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. పలువురు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర న్యాయశాఖ బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఝూర?ండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎం. ఎస్. రామచంద్రరావును త్రిపుర హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కే. ఆర్. శ్రీరామ్‌ను రాజస్థాన్‌కు, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మణింద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బట్టు దేవానంద్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన గతంలోనూ ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు.


# భారత్ నెట్ తో ఫైబర్ నెట్ అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)
ప్రజలకు, విద్యార్థులకు, ప్రభుత్వ విభాగాలకు ఉపయోగపడాల్సిన వ్యవస్థను గత ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం వాడుకుందని... దీంతో ఫైబర్ నెట్ ప్రాజెక్టు లక్ష్యం దెబ్బతిందని సీఎం అన్నారు. 2019లో 8.70 లక్షల కనెన్షన్‌లు ఉండగా... వైసీపీ ప్రభుత్వంలో వాటి సంఖ్య 4.50 లక్షలకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం అని గుర్తు చేశారు.
"నాడు కేవలం 130 మంది ఉద్యోగులతో సంస్థను అద్భుతంగా నడిపాం... 8 లక్షలకు పైగా కనెక్షన్లు ఇచ్చాం...కానీ వైసీపీ ప్రభుత్వం తన పార్టీ కార్యకర్తలకు ఉద్యోగుల కోసం సంస్థలో లేని పోస్టులు సృష్టించింది. 130 మంది ఉద్యోగులను 1,350కి పెంచి దోచుకుంది. ప్రభుత్వ వ్యవస్థల్లో వందల, వేల మందిని నియమించి... పార్టీ కోసం పని చేయించుకునే కొత్త తరహా అవినీతికి గత ప్రభుత్వం పాల్పడింది. ఫైబర్ నెట్‌లో సొంత వాళ్లను నియమించి పార్టీ కోసం పని చేయించుకున్నారు. దీనికి కారణమైన వారిని గుర్తించాలి. నాటి నియామకాలపై విచారణ జరిపి... అన్ని వివరాలు వెలుగులోకి తీసుకురావాలి. ఇదే సమయంలో నాటి తప్పులను సరిదిద్ది భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి" అని సీఎం అన్నారు. ప్రస్తుతం 4,53,525 వరకు ఉన్న కనెక్షన్లను... తిరిగి 8 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 78,355 కి.మీ. మేర ఫైబర్ నెట్ విస్తరించగా, మొత్తం 2 లక్షల కి.మీ. మేర ఫైబర్ నెట్ లైన్ వేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఫైబర్ నెట్ విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ముందుంది. ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 50,481 కి.మీ., తమిళనాడు 49,616 కి.మీ., గుజరాత్ 35,246 కి.మీ., తెలంగాణ 29,143 కి.మీ. మేర ఫైబర్ నెట్ కలిగి ఉన్నాయి.

# ర్యాంకర్లను సన్మానించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)
కంచుమర్తి ప్రణీత్ 311వ ర్యాంక్ సాధించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో ఉండవల్లిలోని తన నివాసంలో ఈ విద్యార్థులను కలిసిన మంత్రి నారా లోకేశ్, వారి ప్రతిభకు ముగ్ధులైనట్లు తెలిపారు. "తమ కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు" అని సోషల్ మీడియా వేదికగా ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాధనను కొనియాడిన మంత్రి, రాష్ట్రంలోని ఇతర విద్యార్థులకు వారు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# శ్రీవారినీ దర్శించుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 14:**
తిరుపతి నుంచి తిరుమలకు అలిపిరి మెట్ల మార్గం ద్వారా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డిలు కాలినడకన వెళ్లి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని సోమవారం వి ఐ పి బ్రేక్ దర్శనం గుండా వెళ్లి దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం కోసం తిరుపతికి చేరుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులకు రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు పోతూరి శ్రీకాంత్ నాయుడు, సీమ కృష్ణ, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. ఆనందగౌడు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల కొండకు చేరుకొని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డిలు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

# శ్రీ కాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 14:**తిరుపతి జిల్లాలోని ప్రముఖ శ్రీ కాళహస్తీశ్వరస్వామి వార్లను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డిలు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులకు శ్రీ కాళహస్తీశ్వర దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా, స్వామి అమ్మవారి దర్శనము అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదం అందించి శాల్వతో సన్మానం చేసి శ్రీ కాళహస్తీశ్వర స్వామి పటం అందించి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులను దీవించారు.

# 50,917 రుపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేసిన ఎన్ ఎండి ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 14:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఫరూక్ సహకారంతో మంజూరైన 50,917 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును నంద్యాల పట్టణం 1వ వార్డు హరిజనవాడకు చెందిన నయాకంటి ప్రవీణకు అందజేసిన తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్.హరిజనవాడకు చెందిన నయాకంటి ప్రవీణ నెలలు నిండక ముందే జన్మించిన శిశువు అనారోగ్యం చేత హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలను ఖర్చు చేస్తూ ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎం డి ఫిరోజ్ తమ ఇంటికి వచ్చి మరి సహాయానిధి చెక్కును అందజేసినందుకు వారికీ ముఖ్యమంత్రి చంద్రబాబు కు మంత్రి ఎన్ ఎండి ఫరూక్ కు ప్రవీణ కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ నాగార్జున, పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, వార్డు టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు.

## రెవెన్యూ, రీసర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి. -జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 14:**
ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు. అర్జీల పరిష్కారంలో నాణ్యతను పెంచి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ స్వీకరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు మెరుగైన దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ శాతం ఫిర్యాదులు రావడం జరుగుతుందని అందుకు ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్డీఓలు ప్రతి రోజూ తహశీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా పరిష్కరించేలా చూడాలన్నారు. రీఓపెన్, గడువులోపల అర్జీలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమీక్ష చేయడం జరుగుతుంది కాబట్టి వాటి పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రజా పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం 3 సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు. 1. సర్వాయి పల్లె గ్రామ కాపరుస్తుడైన అయ్యన్న గారి శ్రీనివాసులు... గ్రామ పొలిమేరలో సర్వేనెంబర్ 165/2 లో 0.45 సెంట్ల భూమి ఇతరులకు ఆన్లైన్ చేసి ఉన్నారని పరిశీలించి తగు న్యాయం చేయగలరని కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. 2. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామం వాస్తవ్యులైన సుశీలమ్మ, శ్రీనివాసులు సర్వేనెంబర్ 883 లో 12.08 ఎకరాల పొలం ఇతరులు ఆక్రమించడానికి చూస్తున్నారని... పత్రాలను పరిశీలించి తగు పరిష్కారం చూపగలరని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 3. డోన్ మండలం యాపదిన్నె గ్రామస్తులైన మనోహర్... సర్వే నంబర్ 420/ఎ నందలి 5.92 సెంట్ల విస్తీర్ణంగల తండ్రి నుంచి వారసత్వ భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని... పరిశీలించి తగు న్యాయం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో 326 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ కాలేజ్ విద్యార్థులకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆద్వర్యంలో ట్రాఫిక్ నిభంధనలపై అవగాహన.

**రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.**

**అతివేగం అత్యంత ప్రమాదకరం.**

**నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూలై 14:**
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద.జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని నేషనల్ డిగ్రీ కాలేజ్ వద్ద విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిభందనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా మాట్లాడుతూ ఇప్పటికే ట్రాఫిక్ పోలీస్ వారి ఆధ్వర్యంలో వివిధ రకాలుగా నంద్యాల పట్టణంలో స్కూల్,కళాశాలలో ముఖ్యమైన కూడళ్లలో విద్యార్థిని విద్యార్థులకు,ఆటో డ్రైవర్లకు ఆటో స్టాండ్ ల,ఇతర వాహన డ్రైవర్లకు వివిద మార్గాల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ గురించి,రోడ్డు భద్రత నిబంధనలు మరియు ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు సులువుగా అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.ఎందుకనగా రోడ్డు ప్రమాదాల బారిన ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు ఎవరు పడకుండా వారి జీవితాలను నష్టపరచుకోకుండా ఉండాలని మా పోలీస్ అధికారుల ఆదేశాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. నంద్యాల పట్టణంలో సుమారుగా నేను ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా చార్జి తీసుకున్నప్పటి నుండి ఇప్పటివరకు విద్యార్థులలో చాలా తక్కువ మందికి చలానాలు విధించడం జరిగింది. కానీ కొంతమంది యువత మితిమీరిన వేగంతో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు కారణమై తీవ్రమైన గాయాల పాలవడమే కాకుండా ప్రాణాలు కోల్పోతూ ఇతరులను కూడా ప్రమాదంలో నెట్టే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తులు జీవితంలో కోలుకోవాలంటే చాలా సమయం పడుతుంది. హెల్మెట్ ధరించడం అంటే కేవలం మోటార్ వాహన చట్టంలోని నిబంధనల కోసమో లేక పోలీసులు వేసే జరిమానా నుంచి తప్పించుకోవటం కోసమో హెల్మెట్ను ధరించడం కాకుండా మన భద్రత కోసం, మనపై ఆధారపడి ఉన్న వారి కోసం హెల్మెట్ను తప్పనిసరిగా హెల్మెట్ దరించాలి.కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించడంతోపాటు ప్రతి ఒక్కరూ లైసెన్స్ మరియు వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని విద్యార్థిని విద్యార్థులకు హెచ్చరికలు జారీ చేయడం జరిగింది.ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ విధ్యార్థులకు ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు,వాహనానికి కావలసిన సరైన దృవపత్రాలు కలిగి ఉండాలి.సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదు.నిభందనలకు వ్యతిరేకంగా వన్ వే లో రాంగ్ రూట్ ప్రయాణం చెయ్యరాదు.ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేయడం, డ్రైవర్ కు ఇరు ప్రక్కన కూర్చోవడం వంటివి చేయరాదు.మితిమీరిన వేగంతో వాహనాలు నడుపరాదు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయరాదు.వాహనాలకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చెయ్యాలి.రహదారి ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదములు జరగటం వలన మరణాలు అంగవైకల్యాలు సంభవిస్తున్నాయి కావున ప్రతి ఒక్కరూ వేగం వద్దు ప్రాణం వద్దు అనే విషయాన్ని గ్రహించి సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు.

# నంద్యాల జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చల్లా మధు ఏకగ్రీవ ఎన్నిక.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 14:**
జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు నంద్యాల నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో ఘనంగా జరిగింది . జెశాప్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, జెశాప్ రాష్ట్ర నాయకుడు మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్రహం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నంద్యాల జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చల్లా మధు ఏకగ్రీవ ఎన్నిక అయ్యారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ జర్నలిస్టులు ఎంత ఒత్తిడి లకు గురవుతుంటారని,అప్పుడప్పుడు క్రీడలు ఆడడంతో మానసిక ఉల్లాసం, శారీరక బడలికపోయి ప్రశాంత త పొందేందుకు దోహదపడుతుందని అన్నారు. అందుకు జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ స్థాపించడం హర్షించదగ్గ విషయమని అన్నారు.జర్నలిస్టుల క్రీడలకు ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాయకుడు మోహన్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చిరంజీవి తదితర నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ లు నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ ఎంతో ఒత్తిడి లకు గురవుతుంటారని, సమయం ఉన్నప్పుడు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం, శారీరక ద్రుడత్వం కలిగి ప్రశాంతతకు దోహదపడుతుందని అన్నారు. ఈ ముఖ్య ఉద్దేశముతో జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ స్థాపించడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఉన్న జర్నలిస్టులతో సత్ సంభందాలు మెరుగుపరచుకోవచ్చని, అలాగే ప్రభుత్వ అధికారులతో, ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయని తెలిపారు. జర్నలిస్టుల యూనియన్లకు అతీతంగా ఈ అసోసియేషన్ ద్వారా ఆటవిడుపు కోసం స్పోర్ట్స్ నిర్వహించడం జరుగుతుందని ,జేశాప్ రాష్ట్ర నాయకుల తో మాట్లాడి త్వరలో నంద్యాలలో రాష్ట్రస్థాయి షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. అనంతరం జర్నలిస్టులు నంద్యాల నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా మధు, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్ రెడ్డి ,సహాయ కార్యదర్శులు గా సాయి వర్మ ,ప్రదీప్, జాయింట్ సెక్రటరీగా మహబూబ్ బాషా, ,ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజశేఖర్, కోశాధికారిగా మిద్దె చార్లెస్, ఉపాధ్యక్షులుగా అర్షద్ అలీ ఖాన్ ,బాలునాయక్, గిరి సాగర్ తో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు ఎన్నికైన సభ్యులను రాష్ట్ర,జిల్లా కార్యవర్గం అభినందించి సన్మానించారు.

# ఖలీల్ సిద్ధిఖి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:** నంద్యాల ఎన్జీవోఎస్ కాలనీ రోడ్డులో ఉన్న ఖలీల్ సిద్ధిఖి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన 30 మంది విద్యార్థులు 20 ఏండ్ల తరువాత అదే పాఠశాలలో ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షునిగా పూర్వపు విద్యార్థి ముద్దం నాగ నవీన్ వ్యవహరించగా స్కూల్ మేనేజర్ ముస్తాక్, ఉపాధ్యాయులు రిటైర్డ్ హెచ్ఎం నాగేశ్వర్ రెడ్డి, హెచ్ఎం సిద్ధికి, అస్మద్దిన్, మస్తాన్, ఖదీర్, అంజద్ భాషా మాట్లాడుతూ తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పూర్వపు విద్యార్థులు అందరూ కలిసి ఒక బీరువాను స్కూలుకి బహుకరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మురళి, సుబ్బరాయుడు, యునస్, ఇర్ఫాన్ దాదా, ఫయాజ్, సంజీవ, శ్రీరామ్, రమీజా, రేష్మ, పద్మావతి, భరణి, విజయ, రాజేశ్వరి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజింద్రారెడ్డి జన్మదిన వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ జులై 14:** మండల కేంద్రంలోని నూరాణి మసీద్ సమీపంలో గల వసీం ట్రేడర్స్ ఆవరణంలో శిరివెళ్ళ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బీజేంద్రా రెడ్డి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎంపిటిసి లు వార్డు సభ్యులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వసీం ట్రేడర్స్ అమీపంలో యువకులు ఉత్సాహభరితంగా జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల భీజెంధ్రరెడ్డి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో భోగభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలందరికీ ఆత్మీయ బంధువుగా గంగుల నాని సుపరిపాలన అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# ఏపీపీ గా నియమితులైన రాజేష్ రెడ్డి ని ఘనంగా సన్మాణించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 14:**
నంద్యాల పట్టణములోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కార్యాలయములో ఏపీపీ గా నియమితులైన సీనియర్ న్యాయవాది ఎస్ ఎన్ రాజేష్ రెడ్డి ని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీమ్ ఆధ్వర్యములో ఘనంగా సన్మాణించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు మరియు క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య , ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ప్రసన్న కుమారీ, ఐక్య వేదిక జిల్లాప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి రహంతుళ్ళ, జిల్లా కార్యదర్శి మోహన్ బాబు, సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ శివరామి రెడ్డి, నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి శివ శంకర్, పట్టణ ఉపాధ్యక్షులు నబి రసూల్, సభ్యులు జమాల్ బాష,ప్రభు నైవేద్యం,




పాస్టర్ జోషఫ్ మరియు ఆల్ మద ద్ ఫౌండేషన్ కంప్యూటర్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకముల రహీం మాట్లాడుతూ న్యాయవాది రాజేష్ రెడ్డి తన వృత్తి ధర్మాన్ని నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ వివిధ సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ ఒక సామాజిక బాధ్యత గల పౌరుడిగా బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న న్యాయవాది రాజేష్ రెడ్డి కి ప్రభుత్వాము గుర్తించి వారికి ఏపీపీగా బాధ్యతలు అప్పగించినందుకు మా ఐక్యవేదిక తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. మన్నెం జానయ్య మాట్లాడుతూ రాజేష్ రెడ్డి సేవా భావముతో మంచి సేవలు అందించి మరెన్నో ఉన్నత పదవులు పొందేవిధముగా దేవుడు ఆశీర్వదించాలని కోరారు. నియమితులైన ఎస్ ఎన్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు నాకు ఏపీపీగా నియమించడం దానికి సహకరించిన వారికి అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తమ దగ్గరకు వచ్చిన బాధితులకు చట్టపరంగా రాజ్యాంగబద్ధంగా తగిన న్యాయం చేసే విధంగా నా వంతు బాధ్యతగా నేను పని చేస్తానని తెలియజేయడం జరిగింది. ఆ తర్వాత సభ్యులు శాలువ, మెమంటోతోరాజేష్ రెడ్డి ని ఘనంగా సన్మాణించడం జరిగింది.

# అంతర్జాతీయప్రమాణాలతో విశాఖ పోర్ట్ : కేంద్రమంత్రి

**విశాఖపట్నం,జులై 14 ఆంధ్ర ప్రగతి :** ప్రపంచంలోని 20 అద్భుత నౌకాశ్రయాలలో విశాఖపట్నం పోర్ట్ ఒకటని కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్ చెప్పారు. విశాఖకు వచ్చిన ఆయన సోమవారం 320 కోట్ల రూపాయలతో చేసిన పోర్ట్ ఆధునీకరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బిమ్స్ టెక్ పేరుతో మ్యారి టైం కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సదస్సులో అంతర్జాతీయ వాటర్ వేస్, మారి-టైమ్ ట్రేడ్ కి సంబంధించి అర్థవంతమైన చర్చ జరిగింది. ఈ సందర్భంలో మారి -టైం ట్రాన్స్ పోర్ట్ అగ్రిమెంట్ జరిగింది. ఈ కాంక్లేవ్ కు ఆరు దేశాల నుండి 26 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల గురించి చర్చించారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఆంధ్ర ప్రగతి డోన్ జులై 14:**
రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఆప్కాస్ కార్మికులను ఫర్మెంటు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకత్వంలో గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వము సానుభూతి మాటలొద్దు నిర్దిష్ట హామీలు ఇచ్చి జీతాలు పెంచి సమస్యను పరిష్కరించి వెంటనే సమ్మెను విరిగింపచేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి యేసు రత్నం ఏ నాగరాజు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్యము ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వము కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా తీవ్ర అన్యాయం జరిగింది. గత ప్రభుత్వ




కాలంలో 17 రోజులు సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. ఈ ప్రభుత్వము ఎన్నికలకు ముందు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుంది. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి అమలు కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులకు కూటం ప్రభుత్వం ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో ప్రధానంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల కార్మికులే ఉన్నారు. వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వాలు వారికి వేతనాలు ఎందుకు పెంచడం లేదు. మున్సిపాలిటీలో ఇంటి పన్నుల పేరు మీద అనేక రెట్లు పన్నులు పెంచి రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడి వారి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని వారన్నారు.

# మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక 2వ రోజు సమ్మె

## ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలి. -సీఐటీయు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ లలో పనిచేసే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులంతా న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకపోవడం వలన 12వ తేదీ అర్ధరాత్రి నుండి నేడు రెండు రోజుల సమ్మె లో పాల్గొంటున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని ప్రజల ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వలన రాబోయే కాలంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ప్రజలకు నీరు అందకపోవడం వీధిలైట్లు వెలగకపోవడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యమే దానికి ప్రజా ప్రతినిధులు, కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని,ప్రజలు అర్థం చేసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్,కే మహమ్మద్ గౌస్ లతోపాటు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, రంగనాథ్, సహాయ కార్యదర్శి బాలదుర్గన్న, మరి కొంతమంది మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ..

రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని గత 15 రోజుల క్రితం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కి ఇంజనీరింగ్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం జరిగిందని, ముఖ్యంగా జీవో నెంబర్ 36 ప్రకారం కార్మికుల అందరికీ 21 వేల రూపాయలు ఇవ్వాలని, గ్రేడ్లలో ప్రకారం అయితే





24 వేల రూపాయలు వర్తించే అవకాశం ఉందని, పది సంవత్సరాలు చేసి రిటైర్ అయిన వారందరికీ 75 వేల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, మృతి చెందిన కార్మికులకు 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికుల కు పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, చనిపోతే మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్ లను పెంచాలని కోరుతూ గత ప్రభుత్వాయంలో ఒప్పుకున్న హామీలకు వెంటనే జీవోలను విడుదల చేసి కార్మికులను కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆప్కాస్ ని రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హాయంలో 22 రోజుల సమ్మె కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని టెంట్ ల దగ్గరికి వెళ్లి మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు హామీ ఇవ్వడం జరిగిందని, అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన ఇంజనీరింగ్ కార్మికుల జీవితాలలో ఎలాంటి మార్పులు జరగడంలేదని సమస్యలను పరిష్కరించమంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికుల అందరికీ వర్తించేలాగున జీవో వెంటనే విడుదల చేయాలని ఇప్పటికే తల్లికి వందనం అమలు చేయకపోవడం చాలా దుర్మార్గమని వెంటనే తల్లికి వందనం కూడా ప్రతి మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి అందేలాగున చూడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి మున్సిపల్ కార్మికుడి కుటుంబాల్లో వెలుగులు నింపుతామని చెప్పినారని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు పట్టణమంతా ప్రజలకు మంచినీరును విడుదల చేయడంలోనూ విద్యుత్ అంతరాయం కలగకుండా చేయడంలోనూ రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని అటువంటి కార్మికులకు కుటుంబాలలో ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబాల్లో వెలుగులు నింపడం కోసము తమ న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని సమస్తరం నుండి పోరాటం చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇదేవిధంగా ప్రభుత్వం మొండిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ఇంజనీరింగ్ కార్మికులు చేయాల్సిన పనులను నిలిపివేశామని, ఇప్పుడు ప్రజలకు నీరు కరెంటు ఇతరత్రా ముఖ్యమైన పనులను నిలిపి వేయడం జరిగిందని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత ప్రభుత్వం పైన ఏర్పడుతుందని ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# సజ్జల శ్రీధర్‌రెడ్డికి బెయిల్ తిరస్కరణ

## బాలాజీ గోవిందప్ప పిటిషన్ కూడా కొట్టివేత

విజయవాడ, **జులై 14 ఆంధ్ర ప్రగతి :**
మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. సోమవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పును వెలువరించారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టేయడం ఇది రెండోసారి. ఇంతకుముందు కూడా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీంతో ఆయన రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు.





# హిస్సార్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ బోగీ బుగ్గి

## రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోగీకీ వ్యాప్తి

## తిరుపతిలో ఘటన.. రూ.కోటి ఆస్తి నష్టం



**తిరుపతి(సెంట్రల్),జులై 14 ఆంధ్ర ప్రగతి :** తిరుపతి రైల్వే యార్డులో అగ్ని ప్రమాదం సంభవించి రూ.కోటి ఆస్తి నష్టం జరిగింది. హిస్సార్-తిరుపతి మధ్య నడిచే వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(04717) సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతికి చేరుకుంది. ప్రయాణికులు స్టేషన్లో దిగాక సుమారు 1.40 గంటల ప్రాంతంలో రైలును యార్డుకు తరలించారు. చింతలచేను సమీపంలో రైలును పార్కింగ్ చేస్తుండగా చివరి నుంచి రెండో బోగీలో మంటలు చెలరేగాయి. గుర్తించిన రైల్వే ఉద్యోగులు వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి, మంటలు చెలరేగిన బోగీ నుంచి మిగతా పెట్టెలను వేరు చేశారు. ఆ పక్కనే నిలిపిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీకి కూడా మంటలు వ్యాపించి, దాని పెయింట్ కాలిపోయింది. దీంతో ఆ రైలు పెట్టెలనూ అక్కడ్నుంచి తొలగించారు. అగ్నిమాపక యంత్రం వచ్చే వరకు రైల్వే సిబ్బంది ఫైర్ బాల్స్ ద్వారా మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే, అప్పటికే బోగీ పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదం పార్కింగ్ ట్రాక్‌లపై జరగడంతో మిగతా రైళ్ల రాకపోకలకు ఆటంకం కలగలేదని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు కె.చినరెడ్డెప్ప తెలిపారు. అగ్ని ప్రమాదాన్ని సిబ్బంది సకాలంలో గుర్తించడంతో మిగతా బోగీలకు మంటలు వ్యాపించకుండా, పెను ప్రమాదాన్ని నివారించిన ట్లైందని చెప్పారు. ఘటనపై విచారణకు జోనల్ స్థాయి అధికారుల కమిటీ వచ్చే అవకాశం ఉంది.

# రామాయపట్నం అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ ఉక్కు

## స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు

## లింగసముద్రంలో ఐరన్ ఓర్ కేటాయింపునకు ఎన్‌వోసీ


%కందుకూరు, **జులై 14 ఆంధ్ర ప్రగతి :**
నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రఖ్యాత జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఇక్కడ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయనుంది. దీని కోసం రామాయపట్నం పరిసరాల్లో భూ కేటాయింపులు చేయాలని గత ప్రభుత్వంలోనే దరఖాస్తు చేసుకోగా..ప్రస్తుతం ఆ దిశగా చకచకా అడుగులు పడుతున్నాయి. ఉక్కు రంగంలో జేఎస్‌డబ్ల్యూకు మంచి పేరు ఉండడంతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేసి..అవసరమైన అనుమతుల మంజూరుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. పోర్టు సమీపంలో భూ కేటాయింపునకు అంగీకరించడంతోపాటు లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఇనుప



ఖనిజ నిక్షేపాలున్న కొండలు, ఇతర ప్రభుత్వ భూములు కూడా ఆ సంస్థకు కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు లింగసముద్రం మండలంలో ఐరన్ ఓర్ నిక్షేపాలున్న పలు గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములు, కొండలను 726 ఎకరాల విస్తీర్ణం మేర జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు మైనింగ్ కోసం అప్పగించేందుకు ఎన్‌వోసీ ఇస్తూ లింగసముద్రం తహసీల్దారు సీతామహాలక్ష్మి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ ఎన్‌వోసీ సమర్పించి ఐదు నెలలు గడవగా తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది. ప్రకాశం,నెల్లూరు జిల్లాల సరిహద్దు మండలాల్లో 9.14 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఐరన్ ఓర్ నిక్షేపాలున్నట్లు జియోగ్రాఫికల్ సర్వే అధికారులు గతంలోనే నిర్ధారించారు. ఈ క్రమంలో లింగసముద్రం మండలంలోని నాలుగు గ్రామాల్లో భూకేటాయింపులకు ఎన్‌వోసీ జారీచేశారు. మండల కేంద్రమైన లింగసముద్రంలో 19.78 ఎకరాలు, తిమ్మారెడ్డిపాలెంలో 150.76 ఎకరాలు, ఆర్ఆర్ పాలెంలో 21 ఎకరాలు, జంగంరెడ్డికండ్రికలో వివిధ సర్వే నంబర్లలో ఉన్న 423.33 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు, రైతులకు సంబంధించిన 111 ఎకరాల పట్టాభూములను, ఎర్రారెడ్డిపాలెంలో 3.46 ఎకరాలను జేఎసడబ్ల్యూ ఐరన్‌ఓర్ మైనింగ్‌కు అప్పగించేందుకు ఎన్‌వోసీ జారీచేశారు.

# కుట్రలు చేసే కు సంస్కృతి వారిది

**చంద్రబాబు వయసుపై పేర్ని వ్యాఖ్యల దుమారం**
**తీవ్ర అసహనంలో వైకాపా నేతలు**
**రాజకీయ దురుద్దేశ్యంతో కూడుకున్నవి**
**మాజీమంత్రి యనమల రామకృష్ణుడు**



**అమరావతిజులై 14 ఆంధ్ర ప్రగతి :**
సీఎం చంద్రబాబునాయుడపై పై వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యల వెనుక కుట్ర ఉందని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఆరోపించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం తాను అధికారంలోకి రాలేనని జగన్ ఆందోళనగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి , వైసీపీ నేతల వ్యాఖ్యలపై యనమల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు వయస్సు 76 సంవత్సరాలు అని.. ఆయన ఎన్ని రోజులు బతుకుతారని.. ఎన్ని రోజులు సీఎంగా కొనసాగుతారంటూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై యనమల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో జగన్, వైసీపీ నేతలు తీవ్ర అసహనంలో ఉన్నారని తెలస్తోందని అన్నారు. అందువల్లనే రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు చంద్రబాబు లేదా టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు ప్రయత్నించే అవకాశం అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులను తొలగించడం వైఎస్ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. తనకు సీఎం పదవి ఇవ్వలేదన్న అక్కసుతో రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి హయాంలలో జగన్ క్రూర రాజకీయాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అధికారం కోసం వైఎస్ కూడా తన హయాంలో హైదరాబాద్ పాతబస్తీలో కల్లోలం సృష్టించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు పీవీ నరసింహారావు, నేదురుమల్లి, విజయభాస్కర్ రెడ్డి వంటి వారిని వైఎస్ రాజకీయ వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. వైఎస్, జగన్ రాజకీయాల కోసం, అధికార పీఠం కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. తనపై ఉన్న 11 క్రిమినల్ కేసులతో జైలులో ఉన్న సమయంలో సహాయం చేసిన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలను కూడా జగన్ రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తల్లి, చెల్లిని కూడా రాజకీయంగా తొలగించాలన్న కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జగన్ జైలులో ఉన్న సమయంలో అతని కోసం కష్టపడినప్పటికీ వారికి వ్యతిరేకంగా తన స్వప్రయోజనాల కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని యనమల రామకృష్ణుడు దుయ్యబట్టారు. వైకాపా నేతలు చేసిన వ్యాఖ్యలు అమానుషమైనవి, నేరపూరితమైనవి. రాజకీయంగా తీవ్ర నిరాశలో ఉన్న ఆ పార్టీ నేతలు ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడలేకే ఆ పార్టీ దాడులకు ప్రేరేపిస్తూ.. అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోందని యనమల మండిపడ్డారు.

# ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె

## సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్

**గుంటూరు,జులై 14 ఆంధ్ర ప్రగతి :** ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుభూతి మాటలతో గందరగోళపరుస్తుందని వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కే ఉమా మహేశ్వర రావు అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం మంగళగిరి కార్పొరేషన్ ఎదుట గల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి అనేక పర్యాయములు తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. సమ్మె ప్రారంభించగానే పరిష్కరిస్తామని మాటలు చెప్పడం కాదని వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల అధికారులు ఇంజనీరింగ్ కార్మికులను బెదిరిస్తున్నారని, బెదిరిస్తే బెదిరిపోయే కార్మికులు కాదని ఆయన అన్నారు. బెదిరింపులు ఆపేసి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో, కూటమి ప్రభుత్వ హయాంలో అనేకసార్లు శాంతియుతంగా నిరసనలు తెలియజేసి, ధర్నాల రూపంలో సమస్యలను



ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రావడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. నెలకు 13 వేల రూపాయలతో ఎలా జీవనం కొనసాగిస్తారని అన్నారు. వెంటనే ప్రభుత్వం వేతనాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరిలో కార్మికులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లే కార్డులు పట్టు-కొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం నుండి ప్రారంభమై దేవస్థానం రోడ్డు, గాలిగోపురం మీదగా మెయిన్ బజార్, మిద్ది సెంటర్, అన్నపూర్ణ థియేటర్ మీదుగా గౌతమ్ బుద్ధ రోడ్డుకు చేరుకొని అక్కడనుండి మరల కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. కాగా ర్యాలీని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి జవహర్లాల్, ఆంధ్రప్రదేశ్
చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంఎ÷-లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, కే సాంబశివరావు, ఎస్ నాగరాజు, పి రాము, కేదార్నాథ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసి కెనాల్ కు నీళ్ళు వదిలి


# రైతులను ఆదుకోండి..!

**...84 వేల ఎకరాల్లో నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు. ...నందికొట్కూరు...ఆత్మకూరు ప్రాంతాల్లో మంచినీటికి కట,కట.**

**...వెలుగోడు రిజర్వాయర్ ను సందర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు. ...**

**కె.సి.కెనాల్ అధికారులతో ఫోన్ లో మాట్లాడిన అభిరుచి మధు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
పకృతి,వరుణుడు కరణించడంతో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడి సమృద్ధిగా నీళ్లు ఉన్నా అధికారులు కేసి కాల్వలు నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని కేసి కెనాల్ అధికారులతో బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడారు.శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు రిజర్వాయర్ ను ఆయన సందర్శించారు.వెలుగోడు రిజర్వాయర్ లో పుష్కలంగా నీళ్ళు ఉండడాన్ని గమనించారు.అక్కడ నుంచే కేసి కెనాల్ అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ నీళ్లు పుష్కలంగా ఉన్నా నీళ్లు వదలకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.రైతులకు వెంటనే నీళ్ళు వదలాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి,వరుణుడు కనుకరించడంతో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయన్నారు.ఎగువ ప్రాంతాల్లో అధికంగా వర్షాలు పడటంతో శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారిందన్నారు.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలం రిజర్వాయర్ లో పూజలు నిర్వహించి నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీళ్ళు వదిలేసి పేర్కొన్నారు.దేశం బాగుండాలంటే రైతులు బాగుండాలని ప్రతి సమావేశంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చెపుతున్నారని అన్నారు.సాగుకు అవసరమైన నీళ్ళు ఉన్నా అధికారులు నీళ్లు వదలకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.నా కున్న సమాచారం మేరకు 84 వేల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారని అన్నారు.నీళ్లు కోసం 44 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.నందికొట్కూరు,ఆత్మకూరు ప్రాంతాల్లో సైతం మంచినీటి కొరత ఉందన్నారు.కళ్ళ ముందు నీళ్లు ఇక్కడినుంచి సోమశిల ప్రాజెక్ట్ కు వెళు తున్నాయని అక్కడ ప్రస్తుతం. 40 టీఎంసీ నీళ్లు నిల్వ ఉన్నట్టు సమాచారం అని తెలిపారు.రైతులు పంటలు వేసేముందే మన రైతులకు అవసరమైన నీళ్ళు ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు.ఎన్ని టీఎంసీ లు,ఎన్ని క్యూసెక్కుల నీళ్ళు వస్తున్నాయి అంచనా అధికారులు వేసుకోవాలన్నారు.గతంలో రబీ,ఖరీఫ్ సీజన్లలో గ్రామాల్లో దండోరా వేసి రైతులకు ముందస్తు జాగ్రత్తలు చెప్పేవారన్నారు.రైతులు పంటలు పండిస్తేనే అందరి కడుపులో ముద్ద దిగుతుందన్నారు.రైతులు కంటతడి పెడితే అరిష్టం అన్నారు.దేశానికి రైతులు వెన్నముఖ అనడం అందరికీ పరిపాటే కానీ రైతుల సమస్యల కోసం పార్టీలకు అతీతంగా కృషిచేయాలన్నారు.రైతులు ఎండనక,వాన అనక గిట్టుబాటు ధర వచ్చినా రాకపోయినా ప్రతి ఏటా నష్టం వచ్చినా,లాభం వచ్చినా పంటలు వేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.అధికారులు వెంటనే కేసి కెనాల్ కు నీళ్ళు వదిలి ఆదుకోవాలన్నారు.గత ఏడాది వర్షాలు లేక ఈ ప్రాంతంలో పంటలు పండించక రైతులు ఆకాశం వైపు చూసిన సంఘటనలు చూశామని గుర్తుచేశారు. దేవుడి దయ వల్ల ఈ ఏడాది 20 రోజుల ముందే శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారిందని,వెలుగోడు రిజర్వాయర్ కు కూడా సంవృద్ధిగా నీళ్లు ఉన్నాయన్నారు.కేసి కెనాల్ వెంట అడ్డంగా ఉన్న గుర్రపు డెక్కలను సైతం అధికారులు తొలగించాలన్నారు.రిజర్వాయర్ లో నీళ్ళు పుష్కలంగా ఉన్నప్పుడే రైతులకు అవసరమైన నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


## ఢిల్లీలోని పలు పాఠశాలలకు బాంబు బెదరింపులు

### అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు

న్యూఢిల్లీ,జూలై14 :దేశంలో బాంబు బెదిరింపులు తమాషాగా మారాయి. ఢిల్లీలోని పలు పాఠశాలలకు సోమవారం ఉదయం ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని చాణక్యపురిలో గల నేవీ స్కూల్, ద్వారక ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు సోమవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. రెండు పాఠశాలలకు ఫోన్ చేసిన ఆగంతకులు స్కూల్స్ ఆవరణలో బాంబులు పెట్టినట్లు- బెదిరించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు రెండు పాఠశాలల్లోనూ తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు- పోలీసులు వెల్లడించారుద

# రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ

### ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్




హైదరాబాద్,జూలై14: రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం-పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీ-ని అద్భుతంగా నిర్మించారు. నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ-.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నా. శ్రీమద్భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటు-న్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటు-ంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నట్లు రేవంత్‌రెడ్డి అన్నారు.

---------------

## పాతబస్తీ పాడుబడ్డ ఇంట్లో అస్థిపంజరం కలకలం

### దర్యాప్తు చేపట్టన పోలీసులు

హైదరాబాద్,జూలై14: నగరంలోని ఓ ఇంట్లో మనిషి అస్థిపంజరం ఉండటం కలకలం రేపింది. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని నాంపల్లి మార్కెట్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఏడేళ్లుగా ఆ ఇంటిలో ఎవరూ లేరని.. యజమాని విదేశాల్లో ఉన్నారని స్థానికులు తెలిపారు. అస్థిపంజరం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్ అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఇటీవల ఓ యువకుడు శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటిలోకి వెళ్లినట్లు సమాచారం. లోపల అస్థిపంజరాన్ని వీడియోలో రికార్డు చేశాడని.. అది వైరల్ కావడంతో యువకుడిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. క్రికెట్ బాల్ ఆ ఇంట్లో పడటంతో తీసుకునేందుకు వెళ్లానని యువకుడు తెలిపినట్లు సమాచారం.

## అటవీశాఖలో ఖాళీల భర్తీకి సర్వీస్ కమిషన్ నిర్ణయం

అమరావతి,జులై14: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఏపీపీఎస్సీ గుడ్ న్యూస్ చెప్పింది. అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి సోమవారం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ శాఖలో జనరల్, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి 691 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. జులై 16 నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకో వచ్చని వివరించింది. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5వ తేదీ ఆఖరు అని స్పష్టం చేసింది. మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొంది.

---------------

## కృష్ణా, గోదావరి జలాల్లో వాటాకు పట్టు

### 16న జరిగే సమావేశంపై కసరత్తు

హైదరాబాద్,జులై14(:: కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు- ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు- గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు- , ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన సూచనలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు-, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. 'కృష్ణా నదీ జలాల వినియోగంలో ఇంతకాలం తెలంగాణకు తీరని ద్రోహం జరిగింది. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైంది. తెలంగాణకు 299 టీ-ఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీ-ఎంసీలు కట్టబెట్టింది. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటు- గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు- ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టింది. దానికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ. లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ప్రకటనలో పేర్కొన్నారు.

# అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు



**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో మోతాదుకు మించి ఉప్పు వినియోగం ఉంటోందని, దీని ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో ముప్పు మరింత పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడమాలజీ' శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉప్పు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అధ్యయనం చేయడంతో పాటు తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి రోజులో 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ, భారత్‌లో పట్టణ ప్రాంతాల ప్రజలు రోజుకు 9.2 గ్రాములు తీసుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం 5.6 గ్రాములుగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**సోడియానికి బదులు..**

ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంతభాగాన్ని పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలతో భర్తీ చేయడం ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్ఐఈ సీనియర్ శాస్త్రవేత్త డా.శరణ్ మురళి పేర్కొన్నారు. సోడియం తక్కువ తీసుకోవడం.. రక్తపోటును తగ్గించడంతో పాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. రక్తపోటు దాదాపు 7/4 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుందని.. ఈ చిన్న మార్పు చాలా పెద్ద ప్రభావం చూపుతుందన్నారు.

**అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు**

ఐసీఎంఆర్ సాయంతో తెలంగాణ, పంజాబ్‌లలో మూడేళ్ల వ్యవధితో కూడిన అధ్యయనాన్ని ఎన్ఐఈ ప్రారంభించింది. రక్తపోటు ఉన్న వ్యక్తుల్లో ఉప్పు తగ్గింపు ప్రభావాన్ని అంచనా వేయడం, దీనిపై కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి లక్ష్యాలతో దీన్ని చేపట్టినట్లు డా.గణేశ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం అధ్యయనం తొలి ఏడాదిలో ఉందని, క్షేత్రస్థాయి సన్నద్ధత, అంచనాలపై పనిచేస్తున్నామని చెప్పారు. దీనిపై గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**లభ్యత తక్కువే..**

మార్కెట్‌లో తక్కువ సోడియం ఉప్పు లభ్యత? ధర ఎలా ఉందనే దానిపై చెన్నైలో 300 రిటైల్ దుకాణాల్లో ఎన్ఐఈ సర్వే చేపట్టింది. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52 శాతం సూపర్ మార్కెట్లలో లభ్యమవుతుండగా.. కేవలం 4శాతం చిన్న కిరాణా దుకాణాల్లోనే ఇది అందుబాటులో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, సాధారణ ఉప్పు ధర 100గ్రాములకు రూ.2.7 ఉండగా.. ఎల్ఎస్ఎస్ ధర రూ.5.6గా ఉందని వెల్లడైంది. తక్కువ సోడియం కలిగిన ప్రత్యామ్నాయాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు

# కాంగ్రెస్ కీలక సమావేశానికి సోనియా పిలుపు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజిక్ గ్రూప్ సమావేశం ఈనెల 15న జరగనుంది. దీనికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత వహించనున్నారు. సోనియాగాంధీ తన నివాసమైన 10, జన్‌పథ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు పాల్గొనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈసారి అధికార, విపక్షా పార్టీల మధ్య వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ చేపట్టడంపై తీవ్ర ఆందోళన చేస్తున్న విపక్షాలు ఈ అంశాన్ని ఉభయసభల్లోనూ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తరువాత జరుగుతున్న తొలి సమావేశాలు కావడంతో ఈ అంశాలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21తో ముగియనున్నాయి. తొలుత ఆగస్టు 12తో సమావేశాలు ముగుస్తాయని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత మరో వారం రోజులు పొడిగించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో లెజిస్లేటివ్ ఎజెండా ఎక్కువగానే ఉండచ్చని తెలుస్తోంది. ఆటమిక్ ఎనర్జీ రంగంలో ప్రైవేటురంగానికి మార్గం సుగమం చేసే కీలక చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

## పాస్‌పోర్ట్, వీసా లేకుండానే విమానంలో సౌదీకి..

# ఎయిర్‌లైన్ కంపెనీకి ప్రయాణికుడి లీగల్ నోటీసులు!



పాక్‌లోని లాహోర్‌కు చెందిన షాజాహాన్ అనే యువకుడు కరాచీ వెళ్లేందుకు విమానంలో బయలుదేరాడు. పొరపాటున సౌదీ అరేబియాలోని జెడ్డాకు చేరుకున్నారు. ఎయిర్‌లైన్స్ కంపెనీ నిర్లక్ష్యం కారణంగానే తాను జెడ్డా నగరానికి చేరుకోవాల్సి వచ్చిందని ఆరోపించాడు. టికెట్ చెక్ చేసిన సమయంలో ఎయిర్ హోస్టెస్ తనను మరో విమానం ఎక్కే సమయంలో ఇంటర్నేషనల్ ఫ్లైట్ ఎక్కకుండా అడ్డుకోలేదని ఆరోపించాడు. డొమెస్టిక్ టెర్మినల్ వద్ద రెండు విమానాలు నిలిచి ఉన్నాయని.. తాను ఓ విమానానికి బదులుగా మరో విమానం ఎక్కినట్లు పేర్కొన్నారు. దాదాపు రెండుగంటల తర్వాత విమానం కరాచీకి చేరుకోకపోవడంతో సదరు ప్రయాణికుడు తన తప్పును తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది తనను నిందించారని సదరు వ్యక్తి పేర్కొన్నాడు. తనకు పాస్‌పోర్ట్ లేదని, వీసా లేకుండానే తాను సౌదీకి చేరానని చెప్పుకొచ్చాడు. ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం కారణంగా సౌదీలో తాను అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఆ దేశంలో ఎఫ్ఐఏ అధికారులు తనను విచారించారని.. తాను తిరిగి కరాచీకి చేరుకునేందుకు మూడురోజుల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో షాజాహాన్ ఎయిర్‌లైన్స్‌కు లీగల్ నోటీసు పంపాడు. ఎయిర్‌లైన్ తప్పు కారణంగా తనకు మానసికంగా, ఆర్థికంగా నష్టం జరిగిందని తెలిపాడు. అదనపు ప్రయాణఖర్చులు, అసౌకర్యానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. లాహోర్ విమానాశ్రయం, పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ దర్యాప్తు ప్రారంభించారు. చెకింగ్, బోర్డింగ్ ప్రక్రియలో ఎయిర్‌లైన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సంఘటన ఒక వ్యక్తి ఇబ్బందులు పడడమే కాకుండా పాక్‌లో విమాన ప్రయాణ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పాస్‌పోర్ట్, వీసా లేకుండా విదేశాలకు ఓ ప్రయాణికుడు చేరుకోవడం ప్రత్యక్షంగా నిబంధనలు ఉల్లంఘించడమే. అయితే, ఇప్పటి వరకు ఎయిర్‌లైన్స్ స్పందించలేదు.

# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక



**ఢిల్లీ:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు

## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారథిగా సోనాలి మిశ్రా




**న్యూఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. భారత సైన్యంలోనూ ప్రవేశించి, తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలి మిశ్రా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితు లయ్యారు. జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు. సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు. రైల్వే ఆస్తులను కాపాడటం, ప్రయాణికుల భద్రత తదితర విధులతో పాటు, వాటి బాధ్యతలను అధికారులకు అప్పగించే విషయంలో ఆర్పీఎఫ్‌కు సోనాలీ మిశ్రా తొలి మహిళా అధికారిగా విధులు నిర్వహించనున్నారు. సోనాలి మిశ్రా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిణి. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (సెలక్షన్)గా పనిచేస్తున్నారు. కాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)1957లో పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటయ్యింది. దీనికి 1985, సెప్టెంబర్ 20న యూనియన్ సాయుధ దళం హోదా ఇచ్చారు. 2021 జూలైలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించిన మొదటి మహిళా కమాండర్‌గా సోనాలి మిశ్రా పేరొందారు.

## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!



కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో సీఎం నివాసంలోని సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు అప్రమత్తమయ్యారు. విస్తృతంగా తనిఖీలు చేసి అది ఫేక్ ఈ-మెయిల్‌గా తేల్చారు. బాంబు బెదిరింపు మెయిల్ రాగానే అధికారులు ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కానీ ఎలాంటి బాంబు జాడ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బెదిరింపు మెయిల్‌కు, తాజాగా వచ్చిన బెదిరింపు మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు. గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు. " ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం" అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

## ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారు..? : తేజస్వి యాదవ్



ప్రముఖ వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే బీహార్ రాజధాని పట్నాలో మరో వ్యక్తి హత్యకు గురికావడంపై.. ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ స్పందించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. లేదా..? అని ప్రశ్నించారు. వరుస హత్యలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. 'వ్యాపారి గోపాల్ ఖేమ్కా హత్య ఘటనను మరువకముందే పట్నాలో ఇప్పుడు బీజేపీ నేత హత్యకు గురయ్యారు. దీనిపై ఏం చెప్తారు.. ఎవరికి చెప్తారు..? అసలు రాష్ట్రంలోని ఎన్డీఏ సర్కారులో ఏ ఒక్కరైనా నిజం తెలుసుకోవడానికి, తప్పులు ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారా..?' అని తేజస్వి ప్రశ్నించారు. సీఎం ఆరోగ్యం గురించి అందరికీ తెలుసని, కానీ ఇద్దరు పనికిరాని బీజేపీ డిప్యూటీ సీఎంలు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.

# ద్రావిడ్ భారీ రికార్డ్ బద్ధలు

## - చరిత్ర సృష్టించిన శుభమన్ గిల్



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రికార్డులు తిరగరాస్తున్నాడు. ఇదివరకే దాదాపు పది రికార్డులను తన ఖాతాలో వేసుకున్న గిల్ ఇంగ్లాండ్‌తో లార్డ్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న మూడో టెస్టులో రాహుల్ ద్రావిడ్ రికార్డును అధిగమించాడు. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయడం ఛేజింగ్ లో భారత జట్టుపై ఒత్తిడిని పెంచింది. అయితే, ఈ ఇన్నింగ్స్ ద్వారా రాహుల్ ద్రవిడ్ 23 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. ఇప్పుడు ఇంగ్లాండ్‌లో ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డ్ మిస్టర్ డిపెండబుల్ ద్రావిడ్ పేరట ఉండేది.మూడో టెస్టులో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేసర్ బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. కీలకమైన ఈ ఇన్నింగ్స్ లో గిల్ కేవలం 6 పరుగులు చేశాడు. దీంతో ఈ టెస్ట్ సిరీస్‌లో గిల్ 607 పరుగులు చేశాడు. దాంతో ఇంగ్లాండ్‌లో ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఇంతకు ముందు ఈ రికార్డు రాహుల్ ద్రావిడ్ పేరిట ఉంది. ద్రావిడ్ 2002లో ఇంగ్లాండ్‌లో జరిగిన 4 మ్యాచ్‌ల%ఖఎ% 6 ఇన్నింగ్స్‌లలో మొత్తం 602 పరుగులు చేశాడు. ఇప్పుడు భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డుపై శుభ్‌మన్ గిల్ కన్నేశాడు. అతను టెస్ట్ సిరీస్ లో తరువాత మ్యాచ్ లలో ఇది సాధించవచ్చు. ఇంగ్లాండ్ పై టెస్ట్ సిరీస్ లో గ్రాహం గూచ్ పేరిట అత్యధిక పరుగుల రికార్డ్ ఉంది. గ్రాహం గూచ్ 1990లో 752 పరుగులు చేశాడు. గిల్ అతని రికార్డును బద్దలు కొట్టాలంటే తరువాత 4 ఇన్నింగ్స్‌లలో గిల్ 146 పరుగులు చేయాలి. గిల్ ఈ సిరీస్‌తో టెస్ట్‌లో టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో అతను సెంచరీ చేశాడు. రెండో టెస్ట్‌లో అతను 430 పరుగులు (269ం161) చేశాడు. ఓ టెస్టుల్లో ఒక భారత బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక స్కోరు ఇది. ఇంగ్లాండ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసింది. జో రూట్ సెంచరీతో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులు చేసింది. భారత్ నుంచి మొదటి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ సెంచరీ చేయడంతో పాటు పంత్, జడేజాల హాఫ్ సెంచరీలతో ఇండియా కూడా 387 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో కేవలం 192 పరుగులకు ఆలౌట్ అయింది, నాల్గవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ సైతం 4 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. ఐదవ రోజున భారత్ విజయానికి 135 పరుగులు చేయాలి. మరోవైపు ఇంగ్లాండ్ నెగ్గాలంటే 6 వికెట్లు తీయాలి. కేఎల్ రాహుల్ 33 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. భారత్ ఆశలన్నీ అతడి మీదే ఉన్నాయి. పంత్ వేగంగా పరుగులు చేయడం జట్టుకు కలిసి రానుంది.



# భారత్‌పై ఇంగ్లండ్ గెలుపు

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమి అభిమానులను నిరాశకు గురి చేసింది. బ్యాటింగ్ వైఫల్యం భారత్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లింది. ఇంగ్లండ్ విధించిన 192 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా టీమిండియా ఛేదించలేక పోయింది. రెండో ఇన్నింగ్స్‌లో కీలక ఆటగాళ్లందరూ చేతులెత్తేశారు. కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలు తప్పిస్తే మిగతా వారు పూర్తిగా తేలిపోయారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ లార్డ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13, రెండో ఇన్నింగ్స్‌లో (0)కే పెవిలియన్ చేరాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా రెండు ఇన్నింగ్స్‌లలో నిరాశ పరిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో (16), రెండో ఇనింనగ్స్‌లో (6) పరుగులు మాత్రమే చేశాడు.కరుణ్ నాయర్ మరోసారి తేలిపోయాడు. జట్టుకు అండగా నిలుస్తాడని భావిస్తే 14 పరుగులకే పెవిలియన్ చేరాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లలో కూడా నాయర్ ఘోర వైఫల్యం చవిచూశాడు. రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్, సుందర్‌లు కూడా విఫలమయ్యారు. పంత్ 9 పరుగులకే పెవిలియన్ చేరాడు. సుందర్ ఖాతా కూడా తెరవలేక పోయాడు. జడేజా ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న జడేజా 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నితీశ్‌కుమార్, బుమ్రా, సిరాజ్‌లతో కలిసి జడేజా భారత్‌ను గెలిపించేందుకు చివరి వరకు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. టాప్ ఆర్డర్‌లో ఒకరిద్దరూ రాణించినా మ్యాచ్‌లో ఫలితం మరో విధంగా ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు

# బాల్ షేపవుట్ పై నేనేం వ్యాఖ్యానించలేను

### భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా



తాజా ఇంగ్లాండ్ పర్యటనలో ఒక ఇష్యూ అటు ఇండియాను, ఇటు ఇంగ్లాండ్ ను ఇబ్బంది పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆట మధ్యలోనే బాల్ పాడవడం, దాన్ని మార్చడం కోసం అంపైర్లతో చర్చించడం ఇరుజట్ల ఆటగాళ్లు రెగ్యులర్ గా చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా పరిస్థితి రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ముఖ్యంగా కొత్త బంతి కూడా పది ఓవర్లు వేసిన తర్వాత కూడా షేప్ ఔట్ అయిపోవడం, అంపైర్ల తమ దగ్గరున్న పరికరాల ద్వారా దాన్ని పరీక్షించడం నిత్య కృత్యంగా అవుతోంది. తాజాగా దీనిపై భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా వ్యాఖ్యానించాడు. బంతి ఇలా తరచూ షేపవుట్ అవడంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. అయితే తెలివిగా దీనిపై నేరుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా, బంతి షేపౌట్ కావడంపై మాత్రం చురకలు అంటించాడు. బంతి ఇలా తరచూ ఇబ్బంది పెడుతుందని చెప్పి, ఐసీసీ ఆగ్రహానికి గురికానని బుమ్రా చెప్పుకొచ్చాడు. తాను చాలా కష్టపడి, బౌలింగ్ చేస్తున్నానని, ఇలా బంతి షేపౌట్ పై వ్యాఖ్యలు చేసి, మ్యాచ్ ఫీజులో కోత విధించుకోవడం తనకిష్టం లేదని వ్యాఖ్యానించాడు. అయితే బంతి రూపురేఖల వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినా కూడా అలాగే బౌలింగ్ చేస్తున్నట్లు తెలిపాడు. ముఖ్యంగా కొన్ని సార్లు అంపైర్లను సంప్రదిస్తే వేరే బంతి ఇస్తున్నారని, మరికొన్నిసార్లు మాత్రం.. కొత్త బంతి లభించడం లేదని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా బంతి మార్పు తన చేతిలో లేదని, తను మాత్రం మంచి బౌలింగ్ తో ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో తను రెండు వికెట్లు తీయడం వెనక బుమ్రా కృషి ఉందని తెలుగు కుర్రాడు నితీవ్ రెడ్డి వ్యాఖ్యానించగా, దాన్ని సున్నితంగా బుమ్రా తోసి పుచ్చాడు. తాను దీనిపై ఏం సలహాలు ఇవ్వలేదని, ఇప్పటి యువతరం కుర్రాళ్లు చాలా ఉత్సాహంగా అన్నీ నేర్చుకుంటున్నారని ప్రశంసించాడు. నిజానికి తనంతట తానుగా మధ్యలోకి వెళ్లి ఎవరికీ సలహాలు ఇవ్వబోనని, ఎందుకంటే తన బౌలింగ్ శైలి, లైన్ అండ్ లెంగ్త్ డిఫరెంట్ గా ఉంటాయని చెప్పుకొచ్చాడు. అయితే ఎవరైనా సాయం కోసం మాత్రమే కచ్చితంగా హెల్ప్ చేస్తానని, వాళ్లను గైడ్ చేసేందుకు సదా సిద్ధంగా ఉంటానని చెప్పుకొచ్చాడు. ఇక రెండో రోజు కూడా రెండసార్లు ఇండియా కెప్టెన్ శుభమాన్ గిల్ అంపైర్లతో వాదనకు దిగాడు. మరోవైపు ఇంగ్లాండ్ కూడా బంతి షేపవుట్ కావడంపై అంపైర్లతో చర్చలు చేశారు. బంతి త్వరగా పాడవడంపై పలువురు మాజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక మూడో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 387 పరుగులు చేయగా, ఇండియా కూడా సరిగ్గా అదే స్కోరుకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ లో మూడో రోజు ఆట ముగిసేసరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో 2/0 చేసింది.



### విడాకులు తీసుకుంటున్న

# సైనా నెహ్వాల్

మరో స్టార్ సెలబ్రిటీ కపుల్ విడాకులు తీసుకుంటోంది. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. కశ్యప్, తాను విడాకులు తీసుకుంటున్నామని సైనా నెహ్వాల్ తన సోషల్ మీడియాలో ఈ విషయాన్ని తెలియజేశారు. బ్యాడ్మింటన్ కోర్టులో వీరిద్దరి ప్రేమ కథ ప్రారంభమైంది. వీరిద్దరూ హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో కలిసి శిక్షణ పొందారు. అకాడమీలో మొదలైన వీరి పరిచయం స్నేహంగా మారింది. అది ప్రేమగా మారి పెళ్లిపీటలెక్కింది. తమ విడాకుల ప్రకటనతో అభిమానులకు సైనా, కశ్యప్ షాకిచ్చారు.బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక నోట్ షేర్ చేశారు. "జీవితం కొన్నిసార్లు మనల్ని వేర్వేరు దారుల్లో నడిపిస్తుంది. చాలా ఆలోచించిన తరువాత నేను, నా భర్త పారుపల్లి కశ్యప్ విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. మేము ఒకరికొకరు పరస్పరం మానసిక ప్రశాంతతతో పాటు ఎంతో అభివృద్ధి చెందాలని, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని ఆకాంక్షిస్తున్నాం. ఇప్పటివరకూ ఉన్న చిరస్మరణీయ క్షణాలకుగానూ కృతజ్ఞతలు. మంచి భవిష్యత్తు ఉండాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ' సైనా పోస్ట్ చేశారు. ఈ కీలక సమయంలో మమ్మల్ని అర్థం చేసుకోవాలని, మా ప్రైవసీకి భంగం కలిగించకుండా ఉండాలని సైనా నెహ్వాల్ కోరారు. సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ లు డిసెంబర్ 14, 2018 న ఘనంగా వివాహం చేసుకున్నారు. హర్యానాలోని హిసార్‌లో జన్మించిన సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ కంటే 3 సంవత్సరాలు చిన్నది. పెళ్లి సమయంలో పారుపల్లి కశ్యప్ వయసు 31 సంవత్సరాలు, కాగా సైనా నెహ్వాల్‌కు 28 ఏళ్లు. పెళ్లి తరువాత సైనా రాజకీయాల్లోకి కూడా ప్రవేశించింది. ఆమె 2020లో బీజేపీ పార్టీలో చేరడం తెలిసిందే. సైనా నెహ్వాల్ 15 సంవత్సరాల వయస్సులో 2005లో ఆసియా టోర్నమెంట్‌ను గెలుచుకుంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో ఆమె బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించింది. ఇది ఒలింపిక్స్‌లో ఆమె అత్యుత్తమ ప్రదర్శన. సైనా నెహ్వాల్ తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో 3 స్వర్ణ పతకాలు గెలుచుకోగా.. ఇందులో 2 మహిళల సింగిల్స్, ఒకటి మిక్స్‌డ్ డబుల్స్‌లో సాధించింది.2015లో, సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో నెంబర్ వన్ స్థానాన్ని పొందిన మొదటి భారతీయ మహిళా క్రీడాకారిణిగా నిలిచింది. పారుపల్లి కశ్యప్ విషయానికి వస్తే, అతను 2014 గ్లాస్గో కామన్వెల్త్‌లో పురుషుల సింగిల్స్‌లో స్వర్ణం సాధించాడు. పారుపల్లి కశ్యప్ 2013లో తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. కెరీర్ బెస్ట్ ఆరవ స్థానానికి చేరుకున్నాడు.

# సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరోన్



ఐపీఎల్ 2026 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ సమయాత్తమవుతోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఎదురైన ఘోర పరాజయాల నేపథ్యంలో జట్టు ప్రక్షాళనపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బౌలింగ్ కోచ్‌ను మార్చింది. జేమ్స్ ఫ్రాంక్లిన్‌ను తప్పించి కొత్త బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించింది. ఈ విషయాన్ని సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. 'మా కోచింగ్ విభాగానికి ఆజ్యం తోడైంది. మా కొత్త బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్‌కు స్వాగతం'అని సన్‌రైజర్స్ హైదరాబాద్ ట్వీట్ చేసింది. జార?ండ్‌కు చెందిన వరుణ్ ఆరోన్..అత్యంత వేగవంతమైన బౌలర్‌గా గుర్తింపు పొందాడు. 2011-2015 మధ్య భారత్ తరఫున 9 వన్డేలు, 9 టెస్టులు ఆడిన వరుణ్ ఆరోన్..29 వికెట్లు తీసాడు. వేగం అతని ప్రధాన బలం అయినప్పటికీ, తరచుగా గాయాల బారిన పడటం వరుణ్ ఆరోన్ కెరీర్‌పై ప్రభావం చూపింది.ఐపీఎల్‌లో 59 మ్యాచ్‌లు ఆడిన వరుణ్ ఆరోన్ 8.94 ఎనానమీతో 44 వికెట్లు పడగొట్టాడు. 2011లో ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన వరుణ్ అరోన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (2014-2016), కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) (2017), రాజస్థాన్ రాయల్స్ (2019-2020), గుజరాత్ టైటాన్స్ (2022) జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. తన చివరి ఐపీఎల్ మ్యాచ్‌ను 2022లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడాడు. ఆ తర్వాత రిటైర్మెంట్ ప్రకటించిన అతను కామెంటేటర్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. ఎమ్ఆర్ఎఫ్ పేస్ ఫౌండేషన్‌లో యువ పేసర్లకు వరుణ్ ఆరోన్ మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇది తప్పా కోచ్‌గా అతనికి ఎలాంటి అనుభవం లేదు.వరుణ్ ఆరోన్ నియామకంపై సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు సరైన ఎంపిక అంటే మరికొందరు మాత్రం తప్పుబడుతున్నారు. బౌలర్‌గానే వరుణ్ ఆరోన్ రాణించలేదని, కోచ్‌గా ఏం చేస్తాడని కొందరు విమర్శించగా.. ఇండియన్ కోచ్‌ను తీసుకోవడం మంచి నిర్ణయమని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ హెడ్ కోచ్‌గా డానియల్ వెటోరి బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. ఐపీఎల్ 2024 సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఐపీఎల్ 2025 సీజన్‌లో మాత్రం ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది.

# అలనాటి నటి బి.సరోజాదేవి కన్నుమూత

## తెలుగులో అగ్రహీరోలతో నటించిన సరోజ




మరో తార రాలిపోయింది. ఒక్కరోజు తేడాతో కోట జ్ఞాపకాలను మరువకుండానే నటి బి. సరోజాదేవి కన్నుమూశారు. సీనియర్ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజాదేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌ల వంటి దిగ్గజ నటులతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. 1938లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13 ఏళ్ల వయసులోనే చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో అభిమానులను సొంతం చేసుకొన్నారు. 1955లో 'మహాకవి కాళిదాస' అనే కన్నడ సినిమాతో చిత్రసీమలోకి అడుగుపెట్టారు సరోజాదేవి. 'పెళ్లిసందడి' (1959)లో తెలుగులో అవకాశం వచ్చింది. దీనికంటే ముందు పాండురంగ మహత్యం, భూకైలాస్ ముందుగా విడుదలై గుర్తింపునిచ్చాయి. సీతారామ కల్యాణం (1961), జగదేకవీరుని కథ (1961), శ్రీకష్ణార్జున యుద్ధం (1963), దాగుడు మూతలు (1964), ఆత్మబలం (1964), శకుంతల (1966), దానవీర శూర కర్ణ (1978), అల్లుడు దిద్దిన కాపురం (1991) వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. 1955 నుంచి 1984 మధ్య 29 ఏళ్ల పాటు- వరుసగా 161 సినిమాల్లో లీడ్‌రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజాదేవి చరిత్ర సృష్టించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

# ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## కన్నప్ప బ్యూటీ నటి ప్రీతి ముకుందన్.



ఇటీవల వచ్చిన 'కన్నప్ప'తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు నటి ప్రీతి ముకుందన్. ఆ సినిమాలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ కీలకపాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ప్రీతి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని అన్నారు.కన్నప్ప లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అనుకోకుండా అవకాశం వచ్చింది. కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా ఇలాంటి పెద్ద సినిమాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. సవాలుగా ఉండే పాత్రలంటే నాకు ఇష్టం. అవి కష్టంగా ఉన్నప్పటికీ గుర్తింపు తెస్తాయి. అలాంటి పాత్రలు ఉంటే ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధమే. కన్నప్పలో ప్రభాస్‌తో (సశశిరశ) కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పాజిటివిటీ- ఉంటు-ంది. ఆయన ప్రత్యేకత స్క్రీన్‌పై కూడా స్పష్టంగా కనిపించింది. నిజ జీవితంలోనూ ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. ఆయన పాన్ ఇండియా స్టార్ అయినప్పటికీ సాధారణంగా ఉంటారు. ఎవరినీ చిన్నచూపు చూడరు. సెట్‌లో అందరినీ గౌరవిస్తారు' అని ప్రీతి ముకుందన్ చెప్పారు.

మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప'లో ప్రభాస్ రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. వీరిద్దరి మధ్య సంభాషణలు సినిమాకే హైలైట్‌గా నిలిచి ఆకట్టు-కున్న విషయం తెలిసిందే. ఇక 'ఓం భీమ్ బుష్'తో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రీతి ముకుందన్ 'కన్నప్ప'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'మైనే ప్యార్ కియా'లో నటిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది.

# హనీతో మళ్లీ మొదలైన ప్రయాణం : నవీన్ చంద్ర



'అందాల రాక్షసి' తో తెలుగు తెరకు పరిచయం అయిన టాలెంటెడ్ హీరో నవీన్ చంద్ర. తన నటనతో మెప్పించినప్పటికీ, కమర్షియల్ హిట్లు- మాత్రం కొంత కాలంగా దక్కడం లేదు. అయినా కూడా, ఆయన వినూత్న కథలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. వరుస పెట్టి త్రిల్లింగ్ చిత్రాలతో అలరిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా, సైకలాజికల్ థ్రిల్లర్ 'హనీ' సినిమా ద్వారా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే నవీన్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అవుతుంది. మా ప్రయాణం త్వరలో ప్రారంభం..' అంటూ ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. దీంతో కొంతమంది నెటిజన్లు అతను కొత్తగా ప్రేమలో పడ్డ డేమోనని అనుకున్నారు. కానీ తీరా విషయం తెలిసి నవీన్ కొత్త సినిమా ప్రమోషన్ మట్టేనని తెలిసి కొంతమంది నిరాశ కూడా వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 'పలాస 1978' తో విమర్శకుల ప్రశంసలు పొందిన కరుణ కుమార్, ఈసారి భావోద్వేగాలు, మానసిక సంఘర్షణ మధ్య నడిచే గాఢమైన కథతో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, రవి పీతలతో కలిసి శేఖర్ స్టూడియో బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. సంగీతం అజయ్ అరసాడ అందించగా, దివ్య పిళ్ళై, దివి వడ్లమణి, రాజా రవీంద్ర, కళ్యాణి మాలిక్, బేబీ జయని తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు- నవీన్ అధికారికంగా ప్రకటించారు.

# హరిహరవీరమల్లు రన్‌టైమ్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిన్నారు. ఇటీవల రిలీజ్ చేసిన హరిహర వీరమల్లు థియేట్రికల్ -ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. మొత్తం 162 నిముషాల అనగా రెండు గంటల 42నిమిషాల రన్ -టైమ్ తో యూ/ఎ సర్టిఫికెట్ తో ఫైనల్ వర్షన్ ను లాక్ చేసారని సమాచారం. సినిమా వీక్షించిన సెన్సార్ టీమ్ నుండి హరిహర టీమ్ కు ప్రశంసలు లభించాయి. చారిత్రక నేపథ్యాన్ని చక్కగా చుపించారని దర్శకుడిని అభినందించారని తెలుస్తోంది. చాలా కాలంగా పవర్ స్టార్ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఆయన ఫ్యాన్స్ కు హరిహర ఒక ఫీస్ట్ లా ఉండబోతుందని యూనిట్ బలంగా నమ్ముతోంది. నేడు సెన్సార్ టీ-మ్ అభినందించడంతో వారి నమ్మకం రెట్టింపైంది. ఇదే జోష్ లో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సన్నాహకాలు చేస్తున్నారు. అందుకోసం వైజాగ్ వేదిక కాబోతుంది. ఈ నెల 20న హరిహర ప్రీ రిలీజ్ వేడుకకు ప్లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రాజామౌళి ముఖ్య అతిథిగా రానున్నారు.



# సినీ పరిశ్రమలో విషాదం.. షూటింగ్‌లో స్టంట్‌మ్యాన్ మృతి




చెన్నై: తమిళ సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా భారీ యాక్షన్ సీన్ చిత్రీకరణలో స్టంట్ మ్యాన్ ఎస్ఎమ్ రాజు ప్రాణాలు కోల్పోయారు. పా రంజిత్ దర్శకత్వంలో ఆర్య నటిస్తున్న 'వెట్టువమ్' సినిమా షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం (జూలై 13) కారు స్టంట్ చేస్తున్న సమయంలో రాజు గుండెపోటుకు గురయ్యారు. వెంటనే రాజుని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.రాజు మృతికి తమిళ చిత్ర పరిశ్రమలోని పలువురు నటులు సంతాపం తెలియజేశారు. ఆయనతో కలిసి పలు చిత్రాల్లో కలిసి పని చేసిన హీరో విశాల్.. రాజు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజు కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మరో స్టంట్ మాస్టర్ సిల్వ కూడా రాజు మరణానికి సానుభూతి తెలియజేశారు. కారు జంపింగ్ స్టంట్స్ చేయడంలో రాజు తర్వాతే ఎవరైనా అని.. ఆయన మరణం స్టంట్ యూనియన్‌తో పాటు చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని అన్నారు.